

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం,15 జనవరి 2026

8 పేజీలు


# చెడు ఆలోచనలకు దహనం..

## ప్రగతి ఆశయాలకు శ్రీకారం

### భోగి వెలుగుల్లో మంత్రి సుభాష్ సంకల్పం!







హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా, జీవనదుల గలగలలు-పాడిపంటల కళకళల నడుమ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురంలో భోగి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తన తండ్రి వాసంశెట్టి సత్యం గారి సేవా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, ప్రజల మనస్సుల్లోని నిరాశను భోగి మంటల్లో దహనం చేసి నూతన ఆశయాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కోనసీమ సంస్కృతికి ప్రతీకలైన కోడిపందాలు, సంప్రదాయ కళారూపాల సాక్షిగా, రైతన్న మోములో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఈసందర్భంగా ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధిని శ్వాసగా, ప్రజాసేవను ధ్యానంగా మలుచుకున్న సుభాష్‌గారు.. ప్రకృతికి కృతజ్ఞత తెలుపుతూ రాష్ట్ర ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారం కంటే ప్రజాభిమానమే మిన్న అనిచాటుతూ, తండ్రీకొడుకులు ఇద్దరూ జనహితమే లక్ష్యంగా సాగుతున్న తీరు కోనసీమలో సరికొత్త ప్రగతి జ్వాలగా నిలిచింది.

రామచంద్రపురం నుంచి
ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

# సై...సైరా..సై

- జోరుగా కోడి పందాలు
- కోట్లాది రూపాయలు జూదం
- అడ్డు అదుపు లేకుండా గుండాట







**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:**సంక్రాంతి సంబరాలు జోరందుకున్నాయి మండలంలోని కొన్ని గ్రామాల్లో కోడిపందెం బరులను నిర్వాహకులు యథేచ్ఛగా నిర్వహించారు చూసేవారికి వినోదం పంచుతూ సై..సైరా..సై అంటూ పందెంకోళ్ళు బరుల్లో కత్తులు దూసుకున్నాయి. పచ్చ..డేగ..కాకి..వంటి పలు రకాల జాతుల పందెంకోళ్లు బరుల్లోనువ్వా..నేనాఅన్నట్టుగా తలపడడంతో పందెం బరులునెత్తురోడాయి. ముందుగానే సిద్ధం చేసుకున్న పందెం రాయుళ్లు కోడిపుంజులకు కత్తులు కట్టి పందెం బరుల్లో దింపడంతో లక్షలాది రూపాయలు బెట్టింగులు పేరుతో చేతులు మారాయి.గుండాట పేరుతో యువత జూదం మత్తులో తెలియడారు. ఆత్రేయపురం మండలం పరిధిలోని ఆత్రేయపురం బొబ్బర్లంక, పేరవరం, తాడిపూడి, లొల్ల, ర్యాలీ తదితర గ్రామాల్లో నిర్వాహకులు ఎటువంటి జంకు లేకుండా ఏడు కోడి పందెం బరులు నిర్వహించారు. తాడిపూడి కోడి పందేల బరిలో 5 పందేలలో పాల్గొని 3 పందేలు గెలిచినా వారికి నిర్వాకులు బుల్లెట్ నజరానా ప్రకటించడంతో అక్కడ పందేలు జోరుగా సాగాయి. అలాగే లొల్ల బరిలో క్రెటా కారు మూడు బుల్లెట్లు నెగ్గిన వారికి ఇచ్చేందుకు రెడీగా పెట్టారు. పందెంరాయుళ్లు దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకుని పందాల్లో పాల్గొన్నారు. ఆయా బరుల సమీపంలో వందల సంఖ్యలో పందెం పుంజులు సిద్ధంగా వుంచి పందాలు నిర్వహించారు. రెండు నెలలుగా మేలు రకం పందెం కోళ్లను పిస్తా, బాదం, డ్రై ఫ్రూట్స్‌తో పాటు బీకాంప్లెక్స్, ఒంటి మందులు కూడా వేసి కోడి పుంజులు బలంగా సిద్ధం చేశారు. గత సంవత్సరం కోడి పందాలు ఆడి ఆర్థికంగా అనేక మంది నష్టపోయారు. పార్కింగ్, గుండాట, పేకాట, మద్యం

- తరువాయి 2లో..

# భోగి భోగ భాగ్యాలను అందించాలి

- రైతు సంస్కృతికి ప్రతీక మకర సంక్రాంతి పండుగ
- రావులపాలెంలలో సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం, మేజర్‌న్యూస్ :** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఇంటికి చేరే సమయం లో చేసుకునే పండుగ మకర సంక్రాంతి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావుఅన్నారు. రావులపాలెం లో ఆయన బుధవారం భోగి పండుగ సందర్భంగా భోగి మంటలను వెలిగించి పండుగ సంబరాలను ప్రారంభించారు. కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు భోగిశు భాకాంక్షలు తెలిపారు .పిల్లలు పెద్దలు అందరూ కలిసి సంక్రాంతి పండుగ వేడుకగా జరుపుకోవాలని అన్నారు. జూదాలకు దూరంగా ఉండి ఆహ్లాదకరమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవుని సన్నిధిలో సంక్రాంతి సంబరాలు





అన్నవరం, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి సన్నిధిలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నవరం దేవస్థానం ప్రాంగణం భక్తి, సంస్కృతి, సంప్రదాయాలతో నిండిపోయింది. ఆలయాన్ని పూలతో, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించగా, స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

భోగిమంటలు, గొబ్బెమ్మల ప్రదర్శనలు పల్లె జీవనశైలిని గుర్తు చేశాయి. గంగిరెద్దుల నృత్యాలు, ఎద్దుల బండ్ల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుని ప్రత్యేక ఉత్సాహాన్ని కలిగించాయి. ఈవో వేంద్ర త్రినాధరావు స్వయంగా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తూ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. భక్తులు సంతోషంగా, ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకోవాలన్నదే మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు. సత్యదేవుని సన్నిధిలో ఆధ్యాత్మిక



కార్యక్రమాలు, పల్లె సంస్కృతి సమ్మేళనంగా నిర్వహించిన ఈ సంక్రాంతి సంబరాలు భక్తుల హృదయాల్లో అపూర్వమైన ఆనందాన్ని నింపాయి.

# విద్యుత్ సమస్యలు దరఖాస్తులు ద్వారా తెలియజేయండి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : పోలవరం జిల్లా రంపచోడవరం పరిధిలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే దరఖాస్తులు ద్వారా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలు తెలియజేయవచ్చని రంపచోడవరం ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి.రమణ పేర్కొన్నారు.

స్థానిక ఏపీఈపీడిసిఎల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సి) ద్వారా పోలవరం జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో గ్రామాలలో కరెంట్ వినియోగదారుల రిటైల్ ధరలపై 2026 - 2027 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు మరియు రిటైల్ ధరలపై వ్యక్తిగతంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరుపతి, విజయవాడ, కర్నూలు నుండి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఈనెల 20,22,23,27 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం వ్యక్తిగతంగా ఉదయం 10.30 నుండి 1.30 వరకు స్వీకరించడం జరుగుతుందని, అదేవిధంగా 2.30 గంటల నుండి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రిటైల్ ధరలపై ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# శోభాయమానంగా సంక్రాంతి సాహిత్యోత్సవం





ఏలూరు,మేజర్‌న్యూస్ : స్థానిక రామకృష్ణా పురంలోని సాహిత్య మండలి శ్రీ పుల్లాభోట్ల శ్రీరామ మూర్తి ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సాహిత్య సభలో విష్ణువజ్జుల రేవతి రాంకుమార్ సంగీతంతో సభికులను అలరింప చేశారు. వీరికి యం.వెంకటేష్ కీబోర్డ్,కె.కల్యాణ్ తబలా, సహకారమందించారు. ఫ్లూట్ ,సింగర్ ఆర్టిస్ట్ సయ్యద్ ఫైఫుదీన్ చే నిర్వహించిన ఫ్లూట్ వాయిద్యం రసవత్తరంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో,విశ్రాంత సాంఘిక శాఖాధ్యక్షు రాలు, సెయింట్ థెరీసా కళాశాల,కోటమర్తి బ్రహ్మేశ్వరి పండుగ విశిష్టత ను విపులంగా వివరించారు. సభలో అభినయ స్త్రీ శక్తి పురస్కార గ్రహీత పొడూరి కనకదుర్గ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయిని ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల బి.త్రిపుర సుందరి దేవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, సాహిత్యమండలి నిర్వహిస్తున్న కార్యక్రమా లను ప్రశంసిస్తూ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసారు. పుల్లాభోట్ల సత్యవాణి, కో కన్వీనర్, సాహిత్య మండలి సభకు అధ్యక్షత వహించి సంస్థ అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం అందించా లని, భవిష్యత్తులో సంస్తలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద జయంతి నీ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమలో తొలుత నృత్యానికి కళానికేతన్, గండికోట రాజేష్ శిష్య బృందం చే నిర్వహించిన స్వాగత నృత్యం ఎంతగానో ప్రేక్షకులను ఆకట్టుకున్నది.అనంతరం ఎస్.ఎ.ఏంఎస్.హమీద్ శ్రీప్రగతి కళామందిర్ ఏలూరుచే నిర్వహించిన అన్నదాత ఆక్రందన. ఏకపాత్రాభి నయంతో సభికులను అలరింప చేశారు. హేలాపురి కళాకారుల సంఘం అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, కె.ఎన్.ఎస్. సుబ్రహ్మణ్యం, వివేకానంద కేంద్ర గోదావరి విభాగ సంపర్క ప్రముక్ కె.రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ స్వర్ణ సత్యవతి, వై.ఆనంద నాయుడు.రిటైర్డ్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాల్గొని వారి సందేశంతో వివేకానంద జీవిత విశేషాలను తెలియచేశారు.సాహిత్య మండలి ప్రధానకార్యదర్శిపుల్లాభొట్ల పురుషోత్తం రెండు రోజులూ సభా నిర్వహణ చేసి, సంస్థ 85 సంవత్సరములు నింపుకొని 86వ సంవత్సరములో అడుగుపెట్టిందని ఈవ్యవస్థక దినోత్సవం సందర్భంగా దాతల విరాళములతో ప్రస్తుత వేదికని ముందుకు పెంచుకోవటం,స్టేజిపైకిఅదనంగాలైటింగ్ అమచుకోవటం, ఒక కొత్త ఫోడియం ఏర్పాటు చేసుకోవటం జరిగిందని. అభివృధి కొరకు ఇంకనూ భవిష్యత్తులో చేపట్టదలచిన పనులను వివరించి సంస్థ అభివృధి కొరకు దాతలు ముందుకు రావాలని కోరారు. రెండు రోజుల కార్యక్రమాలలో పాల్గొన్న వారిని దుశ్శాలువ,జ్ఞాపకాలతో సత్కరించారు.

కె.కె.యస్.స్వామి, సి.ఏ.వివేకానంద జయంతినీ పురస్కరించి నిర్వహించిన క్విజ్,వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.వల్లకవి శ్రీనివాస్ సభా నిర్వహణ చేశారు.

# చెడు ఆలోచనలకు దహనం..

## ప్రగతి ఆశయాలకు శ్రీకారం

**రామచంద్రపురం నుంచి**
**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

తెలుగువారి సంస్కృతికి వెన్నెముక రైతన్న..ఆ రైతన్న కళ్లల్లో ఆనందం చూడటమే పరమార్థంగా సాగుతున్న కూటమి ప్రభుత్వ లక్ష్యం భోగి వెలుగుల్లో స్పష్టంగా ఆవిష్కృతమైంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తన తండ్రి వాసంశెట్టి సత్యం సేవా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, రామచంద్రపురం గడ్డపై బుధవారం నిర్వహించిన భోగి వేడుకలు కేవలం ఒక ఉత్సవంగా కాక, ఒక సామాజిక సంకల్పంగా నిలిచాయి.

**మనస్సులోని కల్మషం దహనం..పవిత్ర ఆశయాల ఉదయం**

బుధవారం తెల్లవారుజామునే స్థానిక వివిఎస్ఎం కళాశాల ప్రాంగణంలో మంత్రి సుభాష్ తన కుటుంబ సమేతంగా భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భోగి మంటలు కేవలం కట్టెలను కాల్చవు.. మన మనస్సుల్లోని నిరాశను, అసూయను, చెడు అలవాట్లను దహనం చేయాలి. పాతను వీడి, కొత్త ఆశయాలతో ముందుకు సాగడమే ఈ పండుగ మనకు నేర్పే పాఠం" అని వ్యాఖ్యానించారు. హిందూ ధర్మంపై ఆయనకు ఉన్న అపారమైన గౌరవం, సంప్రదాయాల పట్ల ఉన్న మక్కువ ఈ వేడుకల్లో ప్రతి అడుగులోనూ కనిపించాయి.

**జీవనదుల గలగలలు.. పాడిపంటల కళకళలు**

కోనసీమ అంటేనే జీవనదుల గలగలలు, పచ్చని పొలాల గలగలలు. ఈ ప్రకృతి సంపదను కాపాడుకుంటూనే, రైతాంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఉద్ఘాటించారు.

**అన్నదాత సుఖీభవ: రైతులకు వెన్నుదన్నుగా నిలిచే భారీ పథకం.**

**- భరోసా:** గిట్టుబాటు ధరతో పాటు రాజముద్రతో కూడిన నూతన పాసు పుస్తకాల పంపిణీ ద్వారా రైతులకు దక్కిన ఆత్మగౌరవం.వీటిని ప్రస్తావిస్తూ, రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

**వారసత్వపు సేవ.. ప్రజాహిత ప్రస్థానం**

మంత్రి సుభాష్ రాజకీయ ప్రస్థానం వెనుక ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం అన్న దశాబ్దాల సేవ ఉంది. సత్యం ఫౌండేషన్ ద్వారా వేలాది మందికి అండగా నిలిచిన సత్యం అన్న బాటలోనే, సుభాష్ నేడు మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి అంకితమయ్యారు. పదవి ఒక బాధ్యతగా భావించి, ప్రజల కష్టాలను తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈ తండ్రీకొడుకుల ద్వయంపై కోనసీమ ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

**కోనసీమ 'సంక్రాంతి' సొగసులు**

హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, చిలక జోస్యం, మరియు గోదావరి జిల్లాల పౌరుషానికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ కోడిపందాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. మన సంస్కృతిని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి గుర్తుచేశారు.

**నా శ్వాస - ధ్యాస నియోజకవర్గం అభివృద్ధే ..**

"నియోజకవర్గ అభివృద్ధే నాశ్వాస.. ప్రజా సేవయే నా ధ్యాస" అని చాటిచెబుతున్న మంత్రి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

ఈ భోగి మంటలు ప్రజల జీవితాల్లో ఆరోగ్య, ఐశ్వర్యాలను నింపాలని ఆకాంక్షిస్తూ ఆయన రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ఎస్.కె.పి.పి. ట్రస్ట్ ఛైర్మన్ సలాది నాయుడు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సై...సైరా..సై

**మొదటిపేజి తరువాయి**

అమ్మకాలతో ఆత్రేయపురం మండలంలో జరుగుతున్న 7 పందెం బరుల్లో సంక్రాంతి 3 రోజుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారడం ఖాయంగా కనిపిస్తుంది.భీమవరం, నరసాపురం, తణుకు, రాజమహేంద్రవరం, హైదరాబాద్ తదితర నగరాల నుంచి వచ్చిన పందెం రాయుళ్ళతో మండలంలో 3కోట్ల దాకాపందాలు జరగనున్నాయి.

# సూరకుంట గ్రామంలో ఘనంగా మావ నాటే - మావ సంస్కృతి క్రీడా ఉత్సవం






చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండలంలోని సూరకుంట గ్రామంలో ఉద్యోగుల సహకారంతో, గొటుల్ టీమ్ నేతృత్వంలో సూరకుంట పెద్దలు, యూత్ లీడర్స్ ఆధ్వర్యంలో గ్రామంలో 13, 14 తారీఖులలో రెండు రోజులపాటు ఘనంగా మావ నాటే – మావ సంస్కృతి క్రీడా ఉత్సవం జరిగింది. మంగళవారంనాడు ప్రారంభం అయిన ఈ ఉత్సవంలో సాంప్రదాయ విలువైద్య పోటీలతోపాటు, కబడి, వాలీబాల్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి ఆటలతోపాటు చక్రం, బామ్ ఇన్ ది సిటీ వంటి వినూత్న గేమ్స్ కూడా నిర్వహించడం జరిగింది. గ్రామంలోని చిన్న పెద్ద యువతి యువకులు గృహినులు రైతులు అందరూ ఉత్సాహవంతంగా పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ఆదివాసీ సాంప్రదాయ వేషధారణ విభిన్నతని, వైవిధ్యాన్ని ప్రోత్సాహించడం కోసం ఆదివాసీ ప్యాషన్ షో నిర్వహించడం జరిగింది. రెండవరోజు ఉదయం వాలీబాల్, కబడి ఫైనల్స్ నిర్వహించి అనంతరం విజేతలకు మరియు గ్రామ నూతన ఉద్యోగార్థులకు సభాముకంగా అతిథి గొటుల్ వ్యవస్థాపకులు మడివి నెహ్రూ, ముఖ్య అతిథి అల్లిగూడెం సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్ బొడ్డు, విశిష్ట అతిథి లిట్స్ ఫాదర్ ఏసురత్నం మరియు గ్రామంలోని సీనియర్ ఉద్యోగులు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అల్లిగూడెం సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్ బొడ్డు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం చూశాక చిన్ననాటి సంక్రాతి సంబరాలు గుర్తుకొచ్చాయని, క్రీడా పోటీలు ఈ సీజన్లో సాధారణమే కానీ ఇలా సంక్రాతి సెలవు రోజుల్లో గ్రామస్తులనందరిని భాగస్వాములను చేస్తూ క్రీడాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు సంభరంగా నిర్వహించడం ద్వారా ఐక్యతని, క్రమశిక్షనని పెంపొందించడం మంచి ఆలోచన అని ఇతర గ్రామాలకు ఆదర్శనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సర్పంచి పాయం చంద్రయ్య, మాజీ సర్పంచి సోడె ధర్మమ్మ, గ్రామ పెద్దలు తోడం చంద్రయ్య, తోడం రామయ్య, తోడం మల్లేష్, సోడె భీమమ్మా, ఉద్యోగులు తోడం దేశయ్య, తోడం కోటేశ్వర్రావు, తోడం ముదరాజు, సోడె కృష్ణ, పిఇటి లు కోర్సా బజారు, నూప రాంబాబు, కట్టం చందు, ఆర్గనైజేర్లు సోడె శ్రీను, సోయం అర్జున్, గోరం రాఘవయ్య, తోడం సుబ్బరాజు, నూప కోటేష్, సవలం ఆనంద్, తోడం క్రాంతి, తోడం మౌనిక, నూప భద్రయ్య, నూప విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భోగి ఉత్సవం



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో బుధవారం భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసి ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా లేచి తలస్నానం చేసి భోగి మంటలు వేశారు. ఆత్రేయపురం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద తదితరచోట్ల భోగి మంటలు వేశారు. హైదరాబాదు, విశాఖపట్నం, అమరావతి తదితర పట్టణాల నుంచి వచ్చిన స్నేహితులు, ఆడపడుచులు రాకతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

# వైభవంగా గోదా రంగనాధుల కళ్యాణ మహోత్సవం





**– వేలాదిమంది భక్తులతో కిటకిటలాడిన కళ్యాణ వేదిక**

**– పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సోమవారం గోదారంగనాథుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈసందర్భంగా స్వామివారిని బ్యాండ్ మేళతాళాలు బాణాసంచా కాల్పులనడుమ ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చి మండపంపై ఆసీనులను చేసి కళ్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో సూత్ర యజ్ఞోప దారణ, జీలకర్ర బెల్లం తలంబ్రాలు కంకణ ధారణ తదితర తదితర కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు,చైర్మన్‌ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణాన్ని తిలకించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలని గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్, ఆకుల రామకృష్ణ, ముదునూరి రాంబద్ర రాజు తదితరులు ఉన్నారు.

# ముళ్ళపూడి ఈశ్వరికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ముళ్లపూడి ఈశ్వరి చదువు బీకాం కంప్యూటర్స్ కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్స్ డిప్లమో కోర్స్ చేసి ఇప్పుడు పై డాన్స్ కోర్సు, ఉన్నత చదువులకు ఈశ్వరి కి ఆర్థికంగా సహాయ పడాలని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక లక్ష 16 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందజేశారు. బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక శివ కేశవుల ఆలయం వద్ద ఈశ్వరి తల్లి డాన్స్ టీచర్ విజయలక్ష్మికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చెక్కును అందించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూమన ప్రాచీన కళలను ప్రోత్సహిస్తూ మమ్మల్ని మన కూచిపూడి మన సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఎంతగానో కృషి చేస్తున్న మన ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాకు విషయాల్లో ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకు తీసుకువెళ్తున్నారని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణికి, యువ నాయకులు జ్యోతుల నవీన్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, జగ్గంపేట టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంకి రాంబాబు, జగ్గంపేట టౌన్ టిడిపి సెక్రటరీ కోడూరి రమేష్, గద్దే మారుతీ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరప్పాడు వెంకన్న ఆలయంలో గోదాదేవి కళ్యాణం

**– భారీ స్థాయిలో భోగిమంటలు, ఉత్సాహంగా గ్రామోత్సవం**





**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో జనవరి 13వ తేదీ బుధవారం భోగి పర్వదినం సందర్భంగా 215 మంది వివాహం కాని యువతీ యువకులచే గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పెళ్ళికాని పెళ్లి ఈడుకొచ్చిన అబ్బాయిలు అమ్మాయిలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. జిల్లా నలుమూలల నుండి పెళ్ళికాని అబ్బాయిలు అమ్మాయిలు తమ తల్లిదండ్రులతో కలిసి వెంకన్నలయానికి వచ్చి ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేకువజామునే ఆలయ ఆవరణలో భారీ స్థాయిలో భోగిమంటల కార్యక్రమం ప్రారంభ సూచికగా నిర్వహించబడినది. సుమారు ఈ కళ్యాణోత్సవంలో వెయ్యి మంది భక్తులు పాల్గొన్నారు. గత సంవత్సరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వారి కంటే అధిక సంఖ్యలో ఈ సంవత్సరం భక్తులు తరలిరావడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీరందరికీ అన్నప్రసాద వితరణ జరుపబడినది. ఈ కార్యక్రమంలో అన్నవరప్పాడు మరియు పరిసర గ్రామ ప్రజలు ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు, దాతలు మరియు ఆలయ సిబ్బంది అర్చకస్వాములు పాల్గొన్నారు అని ఆలయ కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు.

# అంగరంగ వైభవంగా మన పెరవలి సంక్రాంతి సంబరాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి గ్రామంలో గత 2రోజులుగా నిర్వహిస్తున్న మన పెరవలి సంక్రాంతి సంబరాలు మంగళవారం రాత్రి మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం తో సంక్రాంతి సంబరాలు ముగిసాయి. మొదటి రోజు గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తదుపరి మ్యూజికల్ చైర్, పలు వినోదత్మక పోటీలు నిర్వహించారు. రెండవ రోజు పలు సాంస్కృతిక, సంప్రదాయక కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్కెస్ట్రా, డాన్స్ బేబీ డాన్స్, పిల్లలకు వస్త్రాధారణ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిధిలుగా మంత్రి కందుల దుర్గేష్, మాజీ శాసన సభ్యులు, ఏపీఎస్–ఎస్డిసి చైర్మన్ బూరుగుపల్లి శేషరావు, ప్రముఖ నిర్మాత భోగవల్లి ప్రసాద్ పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కనుల పండుగగా మన పెరవలి సంక్రాంతి సంబరాలు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని, గ్రామ నాయకులు నన్ను ఈ కార్యక్రమం చేయాలని చెప్పగానే సాంస్కృతిక శాఖ అధికారులతో మాట్లాడి నిధులు వెచ్చించేలా ఆదేశించానని తెలిపారు. ఈ కార్యక్రమంను తక్కువ సమయంలోనే ఇంత ఘనంగా చేసిన జనసేన,టీడీపీ నాయకులును అభినందించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ఇచ్చి సత్కరించారు. తదుపరి ఇటీవలే గ్రేడ్ 1 సెక్రటరీ గా పదోన్నతి పొందిన పెరవలి సెక్రటరీగా పనిచేస్తున్న ఏ. లక్ష్మీనారాయణను గ్రామ నాయకుల సమక్షంలో సత్కరించి అభినందనలు తెలిపారు.ఇప్పటికే నూతన సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించి పెరవలి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, ఇంకా చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని వాటికీ త్వరలోనే నిధులను కేటాయించి పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.త్వరలోనే కానూరు నుండి కాపవరం వరకు సిమెంట్ రోడ్డును వేస్తామని అన్నారు.నిడదవోలు నియోజకవర్గంను అభివృద్ధి చేసే బాధ్యత నాది అని అన్నారు. ఈ సంబరాలు ఘనంగా నిర్వహించిన జనసేన నాయకులను అభినందించారు పలువురు అధికారులును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెరవలి తహసీల్దార్ కె నిరంజన్, ఎంపీడీవో పద్మజ, ఎస్సై ఎం వెంకటేశ్వరావు, పెరవలి మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవి, వీరవల్లి శ్రీను, మానికిరెడ్డి మురళీకృష్ణ, సలాది కృష్ణమూర్తి, పంపన మావుళ్ళు, మారిశెట్టి రాంబాబు, సలాది శ్రీహరి, దంగేటి దాసు, అల్లాడి రామ కాశీ, బట్న రవిబాబు,బొడ్డు రామాంజనేయులు, బసవ సురేష్, ముదునూరి శ్రీను, కంతేటి శ్రీను తదితర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** మండలంలో జె.కొత్తూరు రామాలయ కమిటీ, మరియు హ్యాపీ చిల్డ్రన్స్ స్కూల్ సారధ్యంలో బుధవారం పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 60 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు వేశారు. అనంతరం ఈ కార్యక్రమంలోతో పాటు రామాలయం నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతిని ఏ.వి కన్వర్షన్ హాల్ ఆర్థిక సాయంతో 24 గ్రాముల వెండి భరణి ని బుదిరెడ్డి రవణమ్మ గెలుపొందగా ద్వితీయ బహుమతి సతీష్ హార్డ్వేర్ ఆధ్వర్యంలో సైనం ఝాన్సీ కి అడపా మురళి అందజేశారు తృతీయ బహుమతిని మంగాదేవి పెట్రోల్ బంక్ తరపున వడ్డాది అపర్ణకు నరిసేనాగు అందజేశారు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు హ్యాపీ చిల్డ్రన్స్ స్కూల్ కస్పాండెంట్ నకిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగింపుగా గ్రామాలలో ముగ్గుల పోటీలు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నా మన్నారు. గ్రామంలో సుఖ సంతో షాలతో వెల్లి విరియాలని



ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి కమిటీ చైర్మన్ నకిరెడ్డి శివ ఎంపిటిసి మడగల పెద్దకాపు, రామాలయ కమిటీ చైర్మన్ కృష్ణార్జున, గ్రామ పెద్దలు చల్లా రాము, చింతల కన్నారావు, నకిరెడ్డి మాతేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ గోదా రంగనాధుల కళ్యాణం





కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ దేవాయలం వీధిలో వేంచేసి యున్న శ్రీ వేణు గోపాలస్వామి వారి ఆలయం నందు బుధవారం భోగి పర్వదినం సందర్భంగా ప్రతీ సంవత్సరం వలనే ఈ సంవత్సరం కూడా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో శ్రీ గోదా రంగనాధుల దివ్యకళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ గోదాదేవి, శ్రీ స్వామివారికి జరిగన కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తుల తరలివచ్చారు. కళ్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించడం జరిగింది.గోదా రంగనాధుల దివ్యకళ్యాణాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వంతో గోవింద నామస్మరణ చేస్తూ తరించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ వెత్సా మురళి, ఈవో రాపర్తి రాజేశ్వరరావు, 30 వ వార్డు టిడిపి ఇన్చార్జ్ అద్దేపల్లి గంగరాజు, అరుణ్‌కుమార్, పంది లక్ష్మీ, శ్రీనివాస్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు



చింతూరు, మేజర్ న్యూస్ : ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం ఉలుమూరు గ్రామంలో పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల్లో కుర్చీ ఆట స్పూను ఆట రంగవల్లులు తదితర ఆటల్లో గెలుపొందిన విజేతలకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మడివి శ్రీదేవి మాజీ ఎంపీటీసీ మడకన్ సీతమ్మ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా బాహ్య ప్రపంచంలో జరిగే అనేక క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో మెలకువ చూపాలని మహిళలు చైతన్యవంతులు కావాలని ఆల్ ఇండియా మహాసభలకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీతమ్మ, గొర్రె మీనా, వి.ఆర్. పురం మండలం నుండి దారమ్మ, గిరిజన సంఘం నాయకులు కారం నాగేష్ ,మడకం ప్రత్యూష, రమ్య, తెల్లం విజయ, కారం లక్ష్మీ, శ్యామల, దుర్గ, కలుముల భవాని తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల వస్త్రాలు పంపిణీ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** హుస్సేన్‌పురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చల్లా బుజ్జి చేతులు మీదుగా పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా చల్లా బుజ్జి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు పాత్ర చాలా కీలకమని, వారి సేవలను కొనియాడారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పంచాయితీలోని పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు

## నారాయణగిరి కొండపై గోదా కళ్యాణం

– ఏజెన్సీలో ఘనంగా భోగి వేడుకలు





**రంపచోడవరం,మేజర్‌న్యూస్:**ద్వారకాతిరుమల దత్తత దేవాలయమైన రంపచోడవరం నారాయణగిరి కొండపై శ్రీదేవి భూదేవి సమేత రంప శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గోదా ఆండాళ్ రంగనాధుల కళ్యాణ మహెూత్సవం అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

ఈ కళ్యాణానికి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వేంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి గోదండాళ్ అమ్మవారికి, స్వామివారికి పట్టు వస్త్రాలు, సూత్రములు, స్వీట్స్, పూలు, గాజులు, కళ్యాణంకు అవసరం అయిన సారె తీసుకుని భక్తులతో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి ఆలయ అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావుకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వేంకటరామారెడ్డి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ధనుర్మాసంలో జరిగే అతి పవిత్రమైన (గోదాండాళ్) గోదా కళ్యాణం వీక్షించి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు. కాగా ఏజెన్సీ గ్రామాల్లో బుధవారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# రామచంద్రపురం కేంద్రంగా పర్యాటక రంగఅభివృద్ధి మంత్రి కందుల దుర్గేష్











**- రూ.4 కోట్లతో ద్రాక్షారామ భీమేశ్వర ఆలయ అభివృద్ధికి నిధులు**
**- రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం సమానంగా పరుగులు తీస్తున్నాయి**
**- రైతుల ఆనందమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**
**: మంత్రి వాసంశెట్టి సుభాష్**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** రామచంద్రపురం నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, పవిత్ర పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామం శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 4కోట్లు కేటాయిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. బుధవారం రామచంద్రపురం వివిఎస్ఎం కళాశాల ప్రాంగణంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కోనసీమ సంక్రాంతి ఉత్సవాలకు' ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**డబుల్ ఇంజన్ వేగంతో అభివృద్ధి....**

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో డబుల్ ఇంజన్ వేగంతో దూసుకుపోతోందని అన్నారు. ప్రజల సంతోషం కోసం సంక్రాంతి సంబరాలతో పాటు గండికోట ఉత్సవాలు, పడవ పందాలు, జగ్గన తోట ప్రభల తీర్థం వంటి వాటిని రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. 'సూపర్ సిక్స్' పథకాల అమలుపై ప్రజల్లో ఎంతో హర్షం వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.

**మంత్రి సుభాష్ కృషి అభినందనీయం**

నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంతటి భారీ ఎత్తున సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. ప్రజల్లో సామాజిక ఐక్యత, సమానత్వం కోసం మంత్రి సుభాష్ పడుతున్న తపనను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

**ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి: మంత్రి వాసంశెట్టి సుభాష్**

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రైతు కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తానని, ఇక్కడి ప్రజల రుణం తీర్చుకునేందుకు నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలందరూ ఐకమత్యంతో, సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్సవాలు ఏర్పాటు చేశామన్నారు.

**ముగిసిన సాంస్కృతిక వేడుకలు:** ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏపీ నీటిపారుదల సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ, జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధిపై ప్రసంగించారు. అనంతరం సినీ నేపథ్య గాయకుడు, సరిగమప విన్నర్ కొండెపూడి యశస్విబృందం నిర్వహించిన మ్యూజికల్ లైవ్‌కాన్సెర్ట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# బీబీజీ సంక్రాంతి సంబరాలు





**- లక్కీ డ్రాలో ఉచిత ప్లాట్ పంపిణీ..**
**- కొత్త కొనుగోలుదారులకు భారీ ఆఫర్లు**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు అదిరిపోయే కానుకలను ప్రకటించింది. "ఫ్రీ రిజిస్ట్రేషన్ నుండి ఫ్రీ ప్లాట్ వరకు" పేరుతో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం భారీ లక్కీ డ్రాను నిర్వహించి విజేతను ప్రకటించింది. బెవర్లీ హిల్స్ కాజా (కాజా), ఫార్చ్యూన్ ఎంపైర్ సిటీ (చలివేంద్రపాలెం), క్యాపిటల్ వెస్ట్ (కొండపావులూరు)లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మొదటి 100 మంది కస్టమర్ల నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేశారు. ఈ డ్రాలో మాచర్లకు చెందిన వి.కిరణ్ అదృష్ట విజేతగా నిలిచారు. బీబీజీ సీఎండీ ఎం.వి. మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా విజేతకు బెవర్లీ హిల్స్ కాజాలో 30 లక్షల విలువైన 133.33 చదరపు గజాల ప్లాట్‌ను ఉచితంగా అందజేశారు. మిగతా 99 ప్లాట్ యజమానులకు రూ. 10,000 గిఫ్ట్ కూపన్లు బహుమతిగా లభించడం ఆశ్చర్యకరమైన సంతృప్తినిచ్చింది.

-కొత్త ఆఫర్ : ఉచిత రిజిస్ట్రేషన్, స్మార్ట్ టీవీ.....
వినియోగదారుల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి, బీబీజీ మేనేజ్‌మెంట్ మరిన్ని పండుగ ఆఫర్లను ( ఈ రోజుల్లో Jan 14th to 16th ) ప్రకటించింది.

-కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసే వారికి ఉచిత రిజిస్ట్రేషన్ :
ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం లేకుండా సంస్థే భరిస్తుంది. నిర్ణీత గడువులోగా ప్లాట్ బుక్ చేసుకున్న వారికి 55 అంగుళాల భారీ స్మార్ట్ ఎల్ఈడీ టీవీని ఉచితంగా అందజేయనున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... "పారదర్శకత, కస్టమర్ల సంతృప్తికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సామాన్యులకు కూడా ప్లాట్ సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పించడమే బీబీజీ లక్ష్యమని" ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సహచరులు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం వినియోగదారులు 040 - 6903 2244 నంబర్‌ను సంప్రదించవచ్చు లేదా https://amaravati.bbgindia.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# ప్రభల ఉత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా పలు మార్గాల ద్వారా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ తెలిపారు. ప్రభల ఉత్సవాన్ని చూసేందుకు వచ్చే రద్దీని దృష్టిలో ఉంచుకుని అమలాపురం,రావులపాలెం వెళ్లే బస్సులు వాహనాలు ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి 16వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల వరకు కొత్తపేట మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్ళిస్తున్నట్లు డిఎస్పీ తెలిపారు. రావులపాలెం వైపు నుండి అమలాపురం వెళ్లే వాహనాలన్నీ బోడిపాలెం వంతెన నుండి వాడపాలెం వయా అయినవిల్లి ముక్తేశ్వరం మీదుగా అమలాపురం వెళ్ళాలన్నారు. అదే విధంగా అమలాపురం నుండి రావులపాలెం వెళ్లే వాహనాలు పలివెల వంతెన నుండి పలివెల,గంటి ఈతకోట మీదుగా రావులపాలెం వెళ్లాలని కోరారు.

ప్రయాణికులందరూ కూడా ఇబ్బందులకు గురికాకుండా ఈ సూచనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర ఉన్నారు.